AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in
9-11-2025 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2

అన్నదాత.. అరిగోస



2



2

అంగన్‌వాడీల 'యాప్'సోపాలు



బోనాలు తెలంగాణ సంస్కృతికి ప్రతీక

– మిగతా 2వ పేజీలో..





# ఆర్ఎస్ఎస్ మహా పథ సంచలన్

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఇందూరు నగర మహా పథ సంచలన్‌ను ఆదివారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని చంద్రశేఖర్ నగర్ కాలనీలో ఉన్న హెచ్‌పీఎస్ పాఠశాల నుంచి కార్యక్రమం ప్రారంభమైంది. అనంతరం చంద్రశేఖర్ కాలనీ, కంఠేశ్వర్ రోడ్, ఉమెన్స్ కాలేజ్ మీదుగా తిరిగి హెచ్‌పీఎస్ పాఠశాలకు చేరుకుంది. పథ సంచలన్‌లో చిన్నారులు అమితంగా ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, ఆర్ఎస్ఎస్ నగర కార్యవాహ అర్గుల సత్యం, ఉప కార్యవాహ వెంకటేష్, సుమిత్, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

–అక్షరటుడే, ఇందూరు




## శ్రీరాంసాగర్ గేట్ల మూసివేత

**అక్షరటుడే, మెండోరా/ఎల్లారెడ్డి :** ఉమ్మడి జిల్లాలో ప్రధాన ప్రాజెక్టు అయిన శ్రీరాంసాగర్‌కు వరద ఉధృతి తగ్గింది. దీంతో వరద గేట్లను ఆదివారం ఉదయం అధికారులు మూసివేశారు. అలాగే నిజాంసాగర్‌కు సింగూరు నుంచి వరద వస్తుండడంతో రెండు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీరాంసాగర్ జలాశయానికి ప్రస్తుతం వరద ఉధృతి తగ్గింది. దీంతో అధికారులు ప్రాజెక్టు వరద గేట్లను మూసివేశారు. అనంతరం ప్రస్తుతం 9,454 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో ఎస్కేప్ గేట్ల ద్వారా 8వేల క్యూసెక్కులు, సరస్వతి కాలువకు 650 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. కాకతీయ, లక్ష్మి కాల్వలకు నీటి విడుదలను నిలిపేశారు. ఇక మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఆవిరి రూపంలో 573 క్యూసెక్కులు పోతోంది. జలాశయం నీటినిల్వ సామర్థ్యం 80.501 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం అంతేస్థాయిలో నీరు నిల్వ ఉంది. ఆదివారం కావడంతో పర్యాటకులు భారీగా తరలివచ్చారు.

### నిజాంసాగర్‌లో..

నిజాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ నుంచి ఇన్‌ఫ్లో వస్తోంది. జలాశయంలోకి ప్రస్తుతం 9,570 క్యూసెక్కుల వరద వస్తుండగా.. అధికారులు రెండు గేట్లు ఎత్తి అంతే మొత్తంలో దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు (17.8 టీఎంసీలు) కాగా.. అంతే మొత్తంలో నీరు నిల్వ ఉంది.




## నాలుగో టౌన్ ఎస్‌హెచ్‌వోగా బాధ్యతలు స్వీకరించిన సతీష్‌కుమార్

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలో నాలుగో టౌన్ ఎస్‌హెచ్‌వోగా సతీష్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఆదివారం ఉదయం ఆయన పోలీస్‌స్టేషన్‌లో ఛార్జ్ తీసుకున్నారు. సతీష్‌కుమార్‌ను నాలుగో టౌన్ ఎస్‌హెచ్‌వోగా నియమిస్తూ ఇటీవల సీపీ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. నిజామాబాద్ నాలుగో ఠాణా, రూరల్ పోలీస్ స్టేషన్లకు ఇది వరకు ఎస్సైలు ఎస్‌హెచ్‌వోలుగా వ్యవహరించేవారు. కాగా.. ఆయా ఠాణాల పరిధిలో కేసులు పెరగడం, శాంతి భద్రతల పరిరక్షణ తదితర కారణాల రీత్యా ఇన్‌స్పెక్టర్లను ఎస్‌హెచ్‌వోలుగా నియమించాలని సీపీ నిర్ణయించారు. ఈ క్రమంలోనే ఆయన పంపిన ప్రతిపాదనకు ఐజీ చంద్రశేఖర్ రెడ్డి ఆమోదం తెలిపారు. తదనుగుణంగా ఇన్‌స్పెక్టర్లను ఎస్‌హెచ్‌వోలుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.



“ బాధితులకు అండగా ఉండాల్సిన ఓ ఇన్‌స్పెక్టర్ వసూళ్లకు పాల్పడుతున్నారు. కేసుకో రేటు లెక్క లంచాలు తీసుకుంటున్నారు. ఫిర్యాదు చేసిన వారిని సైతం వదలడం లేదు. సర్కిల్ పరిధిలోని ఠాణాల్లో నమోదయ్యే కేసులకు సంబంధించి ఆయనకు మాముళ్లు ఇవ్వాల్సిందే. లేదంటే కేసు ముందుకు కదలదు. అంతేగాకుండా తన ఫామ్‌హౌస్‌ను అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చారు. సదరు అధికారి తీరుపై సొంత శాఖలోనే విమర్శలు వస్తున్నాయి.

–అక్షరటుడే, నిజామాబాద్



# ఇన్‌స్పెక్టర్.. అడ్డగోలు వసూళ్లు

- ఫిర్యాదుదారుల నుంచి డబ్బులు తీసుకుంటున్న వైనం
- ఫామ్‌హౌస్ కేంద్రంగా అసాంఘిక కార్యకలాపాలు!
- సీఐ తీరుపై విమర్శలు
- వివాదాస్పదంగా అధికారి వ్యవహారం

కామారెడ్డి జిల్లాలో ఓ ఇన్‌స్పెక్టర్ వ్యవహరిస్తున్న తీరుపై తీవ్ర విమర్శలు వెలువడుతున్నాయి. సీఐ వ్యవహారశైలిపై సొంత శాఖలోనే వ్యతిరేకత రావడం చర్చకు దారి తీసింది. జిల్లాలోని జాతీయ రహదారికి సమీపంలో ఉన్న ఓ సర్కిల్‌కు ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న ఈ పోలీసు అధికారి అడ్డగోలు వసూళ్లకు పాల్పడుతున్నారు. అక్రమ సంపాదనకు కాదేదీ అనర్హం అన్నట్లు ప్రతి కేసులోనూ రూ.లక్షల్లో ముక్కుపిండి గుంజుతున్నట్లు తెలుస్తోంది. సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్‌లలో వచ్చే ప్రతి ఫిర్యాదు, నమోదయ్యే ప్రతి కేసు నుంచి పెద్ద మొత్తంలో చేయి తడపనిదే అడుగు ముందుకు పడనీయడం లేదు అంటే అతిశయోక్తి కాదు.

### ఫామ్‌హౌస్ కేంద్రంగా..

సదరు ఇన్‌స్పెక్టర్‌కు 44వ నంబరు జాతీయ రహదారికి సమీపంలో ఒక ఫామ్‌హౌస్ ఉన్నట్లు సమాచారం. ఇక్కడే అన్ని రకాల సెటిల్‌మెంట్లు నిర్వహిస్తున్నట్లు ప్రచారంలో ఉంది. ఈ ఫామ్‌హౌస్ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారినట్లు సమాచారం. సదరు ఫామ్‌హౌస్‌కు మహిళలు వచ్చి వెళ్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. బాధ్యతాయుతమైన వృత్తిలో ఉండి.. మరోవైపు ఫామ్‌హౌస్‌లో ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతుండటం ఏమిటని స్థానికులు చర్చించుకుంటున్నారు.

### ఆ నేతను ప్రసన్నం చేసుకొని..

అందరినీ ప్రసన్నం చేసుకునే సదరు ఇన్‌స్పెక్టర్ ఎక్కడ పనిచేసినా.. వివాదాలకు కేంద్ర బిందువే. తాజాగా పనిచేస్తున్న చోటులో కూడా ఇదే వివాదాల పరంపర కొనసాగుతోంది. తనపై ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా కామారెడ్డికి చెందిన మైనార్టీ ముఖ్యనేత సోదరుడిని ప్రసన్నం చేసుకున్నట్లు సమాచారం. అలాగే ఇది వరకు ఎస్‌బీలో పని చేసి వెళ్లిన ఓ అధికారికి కూడా పదే పదే విందులు ఇవ్వడం.. రాచమర్యాదలు చేసి పంపడం.. వంటివి చేసినట్లు పోలీసు వర్గాలు కోడై కూస్తున్నాయి.

చిన్నపాటి నిర్లక్ష్యానికే కానిస్టేబుళ్లు, సిబ్బందిపై కొరఢా ఝులిపిస్తున్న జిల్లాస్థాయి అధికారులు.. ఈ అవినీతి అధికారి పట్ల చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంపై విమర్శలు వెలువడుతున్నాయి. ఇప్పటికైనా సదరు ఇన్‌స్పెక్టర్ అక్రమాలపై లోతుగా విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

### మచ్చుకు కొన్ని పరిశీలిస్తే..

గతంలో సర్కిల్ పరిధిలో జరిగిన ఓ చోరీ కేసులో భారీగా వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. నిందితుల నుంచే కాకుండా.. ఫిర్యాదుదారుల నుంచి కూడా పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకున్నట్లు సమాచారం. ఇటీవల నమోదైన ఓ కేసులో రైస్‌మిల్ వ్యాపారి నుంచి రూ.2 లక్షలను ముక్కు పిండి మరీ వసూలు చేసినట్లు ప్రచారంలో ఉంది. సదరు అధికారి తీరుతో సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న స్టేషన్ల ఎస్సైలు విసిగి వేసారి పోయినట్లు సమాచారం. ఈ విషయమై ఎవరికి చెప్పుకోవాలో తెలియక సతమతమవుతున్నట్లు తెలిసింది.



## న్యాయ సేవలపై అవగాహన ఉండాలి

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** న్యాయ సేవలపై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని ఎల్లారెడ్డి మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి సుష్మ మధుమంచి, ఎస్సై మహేష్ అన్నారు. జాతీయ న్యాయసేవల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎల్లారెడ్డి పట్టణంలోని ఎస్సీ సంక్షేమ బాలికల హాస్టల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. ప్రతి పౌరుడు తమ హక్కులు, బాధ్యతలను తెలుసుకోవాలన్నారు. అలాగే న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉచిత న్యాయ సహాయం ఎలా పొందాలనే విషయాలను అవగాహన కల్పించారు. ప్రత్యేకంగా మహిళలు, విద్యార్థినులు, సామాజికంగా వెనుకబడిన వర్గాలు తమ హక్కులను తెలుసుకొని న్యాయం పొందేందుకు అవగాహన కలిగి ఉండాలని స్పష్టం చేశారు. సదస్సులో అడ్వకేట్ పద్మ పండరి, హాస్టల్ వార్డెన్ శారద, లింగమయ్య, న్యాయ సేవా సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సీపీ రెడ్డి పోరాట ప్రతిమ ఆదర్శం



**అక్షరటుడే, ఇందూరు:** సీపీఐ(ఎంఎల్) వ్యవస్థాపకుడు చంద్ర పుల్లారెడ్డి పోరాట ప్రతిమ ఎందరికో ఆదర్శమని వక్తలు కొనియాడారు. సీపీ రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర నాయకురాలు లలిత, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ కుమార్, రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకుడు రామిరెడ్డి, సైదులు, రైతు కూలీ సంఘం నల్గొండ జిల్లా అధ్యక్షుడు రాములు, కార్యదర్శి మల్సూర్, పీవైఎల్ రాష్ట్ర కన్వీనర్ ప్రశాంత్, పీడీఎస్‌యూ రాష్ట్ర కన్వీనర్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ డిక్లరేషన్ అమలు చేయాల్సిందే..: జస్టిస్ ఈశ్వరయ్య



**అక్షరటుడే, కామారెడ్డి:** ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన విధంగా కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఛైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. 42శాతం రిజర్వేషన్ సాధనలో భాగంగా కామారెడ్డిలో ఈనెల 15న నిర్వహించనున్న బీసీ ఆక్రోశ సభ సన్నాహక సమావేశాన్ని పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ 42 శాతానికి పెంచుతామని, విద్య, ఉద్యోగాలలో 42 శాతం ఇస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అలాగే బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేసి బీసీల అభివృద్ధి కోసం ఏడాదికి రూ.20వేల కోట్లు ఖర్చు చేస్తామని.. ఒక్కో మండలంలో గురుకుల పాఠశాల ఏర్పాటు చేసి నవోదయ స్టాండెడ్‌లో విద్య అందిస్తామని చెప్పారన్నారు. 2023లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయితే కులగణన కోసమే ఏడాది సమయం తీసుకున్నారన్నారు. నాడు ఆర్టికల్ 342(ఏ)3 కింద కులగణన చట్టం చేయవచ్చని ఓ చట్టాన్ని తాను రాసిచ్చానని తెలిపారు. దాని ప్రకారం కాకుండా వేరే విధంగా ఇచ్చారన్నారు. రిజర్వేషన్ రాద్ధాంతం జరుగుతుంటే ముసాయిదా డ్రాఫ్ట్ ఇచ్చానని తెలిపారు. తమిళనాడు తరహాలో తెలంగాణలో కూడా రిజర్వేషన్ పెంచుకోవడానికి చట్టాన్ని రాసి ఇస్తే దానిని చూడలేదన్నారు. అనంతరం ఈ నెల 15న నిర్వహించే సభ కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో ఆల్ ఇండియా బీసీ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు విజయ భాస్కర్, వర్కింగ్ ప్రెసిడెంట్ గంగాధర్ యాదవ్, జిల్లా సీనియర్ న్యాయవాది సిద్దిరాములు, కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు భూమన్న, ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు విఠల్, గౌడ సంఘం జిల్లా కార్యదర్శి బాలార్జున్ గౌడ్, బార్ కౌన్సిల్ వైస్ ఛైర్మన్ సునీల్ గౌడ్, బీసీ న్యాయవాదుల జనరల్ సెక్రెటరీ దేవరాజు గౌడ్, చేతి వృత్తుల సంఘం జిల్లా కన్వీనర్ వెంకట్ గౌడ్ పాల్గొన్నారు.

www.aksharatoday.in

2 | నిజామాబాద్/కామారెడ్డి | ఆదివారం | 9.11.2025

AKSHARA TODAY



## ధాన్యంలో తరుగుపై రైతుల ఆందోళన

**అక్షరటుడే, కోటగిరి:** పోతంగల్ మండలం కోడిచర్ల గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో కొనుగోళ్లలో తేడాలు రావడంపై రైతులు ఆందోళనకు దిగారు. కొనుగోలు కేంద్రం నుంచి రైస్‌మిల్‌కు వెళ్లిన ధాన్యం తక్కువ ఉండడంపై ధర్నా నిర్వహించారు. కేంద్రంలో 41.500కిలోలు తూకం వేసి రైస్‌మిల్లుకు పంపిన తర్వాత తక్కువ రావడం పట్ల నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అకాల వర్షాలతో పెట్టుబడులు రాక ఒకవైపు రైతులు నష్టపోతుంటే మరోవైపు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు రైస్‌మిల్లర్లు కుమ్మక్కై రైతులను దోచుకుంటున్నారని మండిపడ్డారు. అధికారులు పూర్తి విచారణ జరిపించి తమకు న్యాయం చేయాలని రైతులు కోరారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.



## కొనుగోళ్లను వేగవంతం చేయాలి..

**అక్షరటుడే, ధర్పల్లి :** ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని.. వరిధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కురిసిన వర్షాలకు కల్లాలు, రోడ్లపై ఉన్న వరిధాన్యం పూర్తిగా తడిసిపోయిందన్నారు. వరిధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయకపోవడం వల్లే ఈ సమస్య వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో దళారులు, రైస్‌మిల్లర్లు తక్కువ ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేశారన్నారు. ప్రభుత్వం ఐకేపీల ద్వారా కొనుగోలు చేసే ధాన్యం కూడా తరుగును క్వింటాలుకు ఆరు కిలోల వరకు తీసుకుంటున్నారన్నారు. తడిసిన ధాన్యం ధరను మరింతగా తగ్గిస్తున్నందున రైతులు పూర్తిగా నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో సేకరణ ఆలస్యం కావడం వల్ల రైతులు పడిగాపులు కాస్తున్నారని వాపోయారు. ప్రభుత్వం వెంటనే తరుగు లేకుండా రైతులకు గిట్టుబాట ధర చెల్లించాలని నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నూర్జహాన్, ధర్పల్లి మండల నాయకులు వాల్గోట్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

**అంగన్‌వాడీ కేంద్రాల్లో లబ్ధిదారులకు అందించే పోషక పదార్థాలు పక్కదోవ పట్టకుండా ఉండేందుకు ప్రభుత్వం ఆన్‌లైన్ విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రత్యేకంగా యాప్ రూపొందించి వివరాలు నమోదు చేయాలని ఆదేశించింది. ఈ మేరకు అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ కూడా ఇచ్చింది. కానీ ప్రస్తుతం సాంకేతిక సమస్యలతో సిగ్నల్ యాప్‌లో వివరాల నమోదుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో అంగన్‌వాడీ టీచర్లతో పాటు లబ్ధిదారులు ఆపసోపాలు పడాల్సి వస్తుంది.** – అక్షరటుడే, ఇందూరు



# అంగన్‌వాడీల 'యాప్'సోపాలు

- యాప్‌లో వివరాల నమోదుకు ఇబ్బందులు
- కేంద్రాల చుట్టూ తిరుగుతున్న లబ్ధిదారులు
- జిల్లాలో 1,501 అంగన్‌వాడీ కేంద్రాలు

జిల్లాలో మొత్తం ఐదు ప్రాజెక్టులు ఉన్నాయి. వీటి పరిధిలో 1,501 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ప్రతి కేంద్రంలో సుమారు 40 నుంచి 50 మంది చిన్నారులు ఉంటారు. వీరికి ప్రతినెలా 16 గుడ్లు, టేక్ హోమ్ రేషన్ అందజేస్తారు. గతంలో గుడ్లు, పోషక పదార్థాలు పక్కదోవ పట్టిన దాఖలాలు ఎన్నో ఉన్నాయి. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యాప్‌లను అందుబాటులోకి తీసుకొచ్చాయి. లబ్ధిదారులు నష్టపోకుండా పూర్తి వివరాలను యాప్‌లో నమోదు చేసేలా నూతన విధానాన్ని తీసుకొచ్చారు. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌హెచ్‌టీఎస్ (న్యూట్రిషన్ హెల్త్ ట్రాకింగ్ సిస్టం), కేంద్ర ప్రభుత్వం పోషణ్ పేరుతో ఈ యాప్‌లను రూపొందించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందించే పోషక పదార్థాలను యాప్‌లో నమోదు చేయాలి. లబ్ధిదారుల ఫొటో క్యాప్చర్‌తో పూర్తి వివరాలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. దీని కోసం ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్లకు ఒక ఫోన్ తో పాటు ఇంటర్నెట్ సౌకర్యం కల్పించింది.

### సిగ్నల్ ప్రాబ్లం

ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విధానం బాగానే ఉన్నా.. జిల్లాలోని కొన్ని గ్రామాలతో పాటు పట్టణాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సెల్ ఫోన్ సిగ్నల్స్ సరిగ్గా లేకపోవడం శాపంగా మారింది. అధికారులు అందజేసిన ఫోన్లు హ్యాంగ్ కావడం, ఇంటర్నెట్ కెపాసిటీ సరిపోకపోవడంతో వివరాలు నమోదులో జాప్యం ఏర్పడుతుంది. దీంతో చాలామంది అంగన్‌వాడీ టీచర్లు తమ సొంత ఫోన్‌లోనే యాప్‌లను వినియోగిస్తున్నట్లు చెబుతున్నారు. నెలలో పది రోజులు వివరాలు నమోదు చేయడంలోనే సరిపోతుందని వాపోతున్నారు.

### లబ్ధిదారుల ప్రదక్షిణలు

చిన్నారులకు ప్రతినెలా కోడిగుడ్లు, బాలామృతం అందజేస్తారు. వీటికోసం వారి తల్లిదండ్రుల ఫొటో, ఐరిస్‌తో వివరాలను నమోదు చేసి అందజేయాల్సి ఉంటుంది. అయితే సరైన ఇంటర్నెట్ లేకపోవడం, సర్వర్ డౌన్ కావడంతో లబ్ధిదారులు రెండు నుంచి మూడుసార్లు తిరగాల్సి వస్తుంది. ఒక్కో సారి పోషక పదార్థాలు తీసుకోకుండానే వెనుతిరుగుతున్నట్లు చెబుతున్నారు. అలాగే నూతనంగా నమోదు చేసుకునే గర్భిణులకు ఇదే తరహా ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

### పక్కదోవ పట్టకుండా ఉండేందుకే యాప్

అంగన్‌వాడీ కేంద్రాల్లో అందజేసే పౌష్టికాహారం పక్కదోవ పట్టకుండా ఉండేందుకే యాప్ రూపొందించారు. కొన్ని ప్రాంతాల్లో సిగ్నల్‌తో సమస్య ఏర్పడుతుందనేది వాస్తవం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. సాంకేతికపరంగా అధిగమించేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రతి అంగన్‌వాడీ టీచర్ విధిగా వివరాలను యాప్‌లో నమోదు చేయాలి.

– రసూల్ బీ, జిల్లా సంక్షేమ అధికారిని

## సెయింట్‌పాల్ హైస్కూల్‌లో స్వచ్ఛభారత్



**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలోని మామిడిపల్లిలో సెయింట్ పాల్ హైస్కూల్‌లో ఆర్మూర్ మహాత్మ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ ఆవరణలో పెరిగిన పిచ్చి మొక్కలు, చెట్లను తొలగించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్ మాట్లాడుతూ.. 'ప్రతి ఆదివారం ఒక గంట..' నినాదంతో చేస్తున్న ఈ స్వచ్ఛ కార్యక్రమం విజయవంతంగా 28 వారాలు పూర్తి చేసుకుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్వచ్ఛ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు తమ వంతుగా స్వచ్ఛ కార్యక్రమలో పాల్గొనాలన్నారు. అనంతరం స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులను పాఠశాల సిబ్బంది శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కేథరిన్ పాల్, కరస్పాండెంట్ ఇనాక్పాల్, వైస్ ప్రిన్సిపాల్ సిసిల్యా ఏంజిల్, సంస్థ సభ్యులు సుంకె, నిశాంత్, బొగడమీది ప్రశాంత్, వేద రాజ్ కుమార్ నరేందర్, గుర్రం రాకేష్, నరేశ్, కృషివర్ధన్ పాల్గొన్నారు.

## పేకాడుతున్న పలువురి అరెస్ట్

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** పేకాడుతున్న పలువురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎల్లారెడ్డి పోలీసులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం వారు వివరాలు వెల్లడించారు. పట్టణంలోని బ్రాహ్మణపల్లి శివారులో పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు చేశామన్నారు. ఈ సందర్భంగా నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 12,510 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే నాలుగు మొబైళ్లు, మూడు బైక్‌లు స్వాధీనం చేసుకున్నామని వివరించారు. అనంతరం తెలంగాణ గేమింగ్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ పేకాట ఆడడం చట్టరీత్యా నేరమన్నారు. ఎవరైనా ఆడితే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

**ధాన్యం అమ్ముకోవడానికి అన్నదాతలకు అవస్థలు తప్పడం లేదు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటలను కొనుగోలు కేంద్రాలకు తెచ్చినా పట్టించుకునే వారు కరువయ్యారు. భారీ వర్షా లు, చీడ పీడలతో రైతులు వానాకాలం సీజన్‌లో తీవ్రంగా నష్టపోయారు. దిగుబడి భారీగా తగ్గింది. వచ్చిన ధాన్యాన్ని విక్రయించడానికి సైతం తిప్పలు పడాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు.**

– అక్షరటుడే గాంధారి



# అన్నదాత.. అరిగోస

- కొనుగోలు కేంద్రాల్లో నిర్లక్ష్యం
- ధాన్యం తూకంలో జాప్యం
- తరుగు పేరిట దోపిడీ
- పట్టించుకోని అధికారులు


జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు నెమ్మదిగా సాగుతున్నాయి. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాలకు ధాన్యాన్ని తరలించినా సకాలంలో తూకాలు చేపట్టకపోవడంతో రైతులు ధాన్యం కుప్పల వద్దే పడిగాపులు కాయాల్సి వస్తోంది. కేంద్రాల్లో అసలు రైతులను పట్టించుకునే వారు కరువయ్యారు. మొన్నటి వరకు వర్షాలతో ధాన్యం తడిసిపోయింది. రంగు మారి, మొలకలు సైతం వచ్చాయి. దీంతో వేగంగా కొనుగోళ్లు చేపట్టాలని రైతులు కోరుతున్నాయి. అయినా నిర్వాహకులు మాత్రం ధాన్యం సేకరణలో అలసత్వం ప్రదర్శిస్తున్నాయి.

### 42 కిలోల తూకం

ప్రభుత్వం ధాన్యానికి క్వింటాలుకు రూ.2,389 మద్దతు ధర చెల్లిస్తోంది. సన్నరకం వడ్లకు అదనంగా రూ.500 బోనస్ వస్తుంది. అయితే కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు మాత్రం రైతులను నిలువునా ముంచుతున్నారు. తరగు పేరిట 40 కేజీల బ్యాగ్‌లో అదనంగా 2 కిలోలు జోకుతున్నారు. దీంతో క్వింటాలుకు 5 కిలోలు తరుగు రూపంలో పోతోంది. ఫలితంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పంటను బాగా ఆరబెట్టి తెచ్చిన తరుగు తీస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే పలువురు మిల్లర్లు లారీలు అన్‌లోడ్ చేసే సమయంలో మళ్లీ తరుగు తీస్తున్నారు.

### హమాలీలు, సుత్లీల భారం రైతుపైనే..

ధాన్యం తూకం వేసే సమయంలో ప్రభుత్వం కేవలం గోనె సంచులను మాత్రమే అందిస్తుంది. దీంతో కాంటా మొదలుకొని చివరికి గోనెసంచులు కుట్టే సుత్లీలను కూడా రైతులే భరించాల్సి వస్తోంది. ఇది కూడా రైతులకు అదనపు భారంగా మారింది. గోనె సంచులు కుట్టేందుకు హమాలీ ఛార్జీలు రూ.14 వసూలు చేస్తున్నారని. సుత్లీలు సైతం రూ.70కి ఒక కట్ట వస్తోందని ఇదంతా తమకు భారంగానే మారిందని వారు వాపోతున్నారు. ఇక సన్న వడ్ల



రైతుల కష్టాలు అన్నీఇన్నీ కావు.. సన్నరకం వడ్లు అని తెలిసేందుకు సంచులపై ముద్రం కోసం రంగులు కూడా రైతులే తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

### సమస్యలను కలెక్టర్‌కు వివరించాం

కొనుగోలు కేంద్రంలో తూకాల్లో తేడాలు వస్తే సహించలేదు లేదు. ఈ సమస్యపై చర్యలు తీసుకుంటాం. గతంలో సంచులు కుట్టేందుకు సుత్లీలు ఇచ్చేవాళ్లు. ఈమధ్య సుత్లీలు కేంద్రాలకు రావట్లేదు. రైస్‌మిల్లర్లు తమ దగ్గరికి వడ్లు వచ్చే సమయానికి తేడా అవుతోందని పేర్కొంటున్నారు. రైస్‌మిల్లర్ల విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. కొనుగోలు కేంద్రాల్లో సమస్యలను పరిష్కరిస్తాం.

– విగ్నేష్, ఏఈవో



## బోనాలు తెలంగాణ సంస్కృతికి ప్రతీక

తెలంగాణ సంస్కృతికి బోనాలు ప్రతీక అని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్య నారాయణ గుప్తా అన్నారు. నగరంలోని 19వ డివిజన్‌లోని మహాలక్ష్మి ఆలయంలో బోనాల పండుగ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ.. బోనాలు ప్రజల ఐకమత్యానికి భక్తి భావానికి అద్దం పడతాయన్నారు. బోనాల నిర్వహణ ద్వారా సంఘాలు మరింత బలపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు నాగోల్ల రవి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగోల్ల లక్ష్మీనారాయణ, సాయి, ప్రవీణ్, ప్రసాద్, సాయిరాం, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

– అక్షరటుడే, ఇందూరు

## జాతీయ రహదారిపై పెట్రోల్ ట్యాంకర్ బోల్తా



**అక్షరటుడే, మెండోరా:** మండల పరిధిలోని బుస్సాపూర్ వద్ద జాతీయ రహదారిపై పెట్రోల్ ట్యాంకర్ బోల్తా పడింది. ఈ ఘటన ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. హైదరాబాద్ నుంచి నిర్మల్ వైపు వెళ్తుండగా.. మెండోరా ఎస్సై సుహాసిని తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి నిర్మల్‌కు వెళ్తున్న పెట్రోల్ ట్యాంకర్ బుస్సాపూర్ వద్దకు రాగానే అదుపుతప్పి బోల్తా పడింది. అదృష్టవశాత్తు ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. సమాచారం అందుకున్న మెండోరా పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పెట్రోల్ ట్యాంకర్ కావడంతో వాహనం వద్దకు ఎవరూ వెళ్లకుండా భద్రత ఏర్పాటు చేశారు. అనంతరం రోడ్డుకు అడ్డంగా ఉన్న లారీని తొలగించే ప్రయత్నం చేస్తున్నారు.